క్లుప్తంగా

నెలాఖరులోపు పని దినాలు పూర్తి చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రుద్రవరం: ఉపాధి హామీ పథకంలో నెలాఖరులోపు వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి ఏపీఓ ప్రతాప్, క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా 90 రోజుల పాటు పనులు చేయాల్సిన కుటుం బాలకు సంబంధించి 68వేల పని దినాలు మిగిలి ఉన్నాయని వాటిని త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. అలాగే ఉద్యాన వనాల కింద లక్ష్యాన్ని చేరుకునేందుకు 47 ఎకరాలు మిగిలి ఉందని రైతులు ముందుకు వచ్చి పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు.

ఆటో కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేయాలి



ఆటో యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రసాద్

నంద్యాల(న్యూటౌన్): ఆటో కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేయాలని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని బొమ్మలసత్రంలో నూతన ఆటో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఆటో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. ఆటోకార్మికులకు ఇంటిస్థలంతో పాటు పక్కాగృహం నిర్మించి ఇవ్వాలన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(అర్బన్): పార్టీలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధి జరగాలని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఫరూక్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో బుధవారం ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన నంద్యాల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ పల్లెల్లో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తెస్తే అధికారుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ త్వరలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపరాు. సమావేశంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, తహసీల్దార్ ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

లోపాలు సరిదిద్దాలని వినతి

నంద్యాల(న్యూటౌన్): వర్క్ అడ్జెస్టుమెంట్‌లో ఉన్న లోపాలను సరిదిద్దాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట డీఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఈడీలో మెథడాలజీ ఉందన్న సాకుతో సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని స్కూల్ అసిస్టెంట్లుగా హైస్కూళ్లకు పంపడం సమంజసం కాదన్నారు. 117వ జీవోను రద్దుచేసి 53వ జీవో ప్రకారం ఉపాధ్యాయులకు పని సర్దుబాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎంఈఓలు డీఏ బిల్లులు సకాలంలో చేయకపోవడం వల్ల సీఎఫ్ఎంఎస్‌లో ఇప్పుడు బిల్లులు పెట్టుకోలేక టీచర్లు నష్టపోతున్నారన్నారు.

కూలిన మట్టిమిద్దె



కూలిన గోడను పరిశీలిస్తున్న వీఆర్ఓ

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో భారీ వర్షాలకు బుధవారం తెల్లవారుజామున ఓ మట్టిమిద్దె కూలింది. అయితే, ఈ ఘటనలో ఇంటి యజమానులైన పక్రుద్దీన్, రమీజా దంపతులకు ప్రమాదం తప్పింది. మిద్దె కూలిన సమయంలో వారిద్దరు బయటకు రావడంతో ప్రాణాలతో బయట పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ రెవెన్యూ అధికారి సాంబశివుడు కూలిన ఇంటిని పరిశీలించారు. అలాగే చిన్న తులసన్నకు చెందిన మట్టి మిద్దె సైతం బుధవారం తెల్లవారుజామున కూలిపోయింది. అయితే, వారు బయట గదిలో పడుకోవడంతో ప్రమాదం తప్పింది.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి: వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఏఎస్ఐ షేక్ అబ్దుల్ నబీ కోరారు. బుధవారం మండలంలోని కలుగోట్లపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న వక్కిలేరు వాగు నీటి ఉధృతిని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. తర్వాత వక్కిలేరు వాగు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గురుదేవోభవ!

మనలోని అజ్ఞాన పొరలు తొలగించి, జ్ఞాన దీప్తిని వెలిగించే వ్యక్తి గురువు. పుట్టుకకు తల్లిదండ్రులు కారణమైతే.. జీవన వికాసానికి తొలి మార్గదర్శి గురువు. అందుకే మనం గురువును దైవం కంటే మిన్నగా భావిస్తాం. తల్లిదండ్రులతో సమానంగా పూజిస్తాం. ప్రతి ఏటా సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించి అవార్డులతో గౌరవిస్తాం. నియోజవర్గ వ్యాప్తంగా 277 పాఠశాలలు ఉండగా అందులో 931 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు టీచర్లను ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా విద్యాశాఖ ఎంపిక చేసింది. గురువారం జిల్లా కేంద్రం నంద్యాలలో జరిగే కార్యక్రమంలో వారు అవార్డులు అందుకోనున్నారు. – ఆళ్లగడ్డ

నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

ఉపాధ్యాయుడి పేరు	హోదా	ప్రస్తుతం స్థానం
శివనాగేంద్రుడు	హెచ్ఎం	జెడ్పీహెచ్ఎస్, యాళ్లూరు
సోమశేఖరప్ప	ప్రిన్సిపాల్	ప్రభుత్వ కళాశాల, నంద్యాల
ఉదయ్‌కుమార్‌బాబు	పీఈటీ	ఏపీఎంఎస్, గోస్పాడు
చంద్రపాల్	జూ.లెక్చరల్	ప్రభుత్వ కళాశాల, గోస్పాడు
నందకుమార్‌బాబు	జూ.లెక్చరర్	ప్రభుత్వ కళాశాల, గోస్పాడు
పెద్దయ్య	జూ.లెక్చరర్	ప్రభుత్వ కళాశాల, ఆళ్లగడ్డ
శ్రీనివాసులు	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, చాగలమర్రి
కృష్ణశాస్త్రి	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, చాగలమర్రి
విశ్వనాథ్	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, టీబీగుంట్ల
వెంకటరమణ	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, రుద్రవరం
రామలక్ష్మమ్మ	స్కూల్ అసిస్టెంట్	బాలికల పాఠశాల, చాగలమర్రి
మేరిమార్గరేట్	స్కూల్ అసిస్టెంట్	బాలికల పాఠశాల, నంద్యాల
గోపాల్	పీఎస్‌హెచ్ఎం	ఎంపీపీ స్కూల్, కోటపాడు
శైలజ	ఎస్‌జీటీ	ఎంపీపీస్కూల్, జిల్లెల్ల
అబ్దుల్‌గఫార్	ఎస్‌జీటీ	ఎంపీపీస్కూల్, శిరివెళ్ల
ఏసుదాసు	ఎస్‌జీటీ	ఎంపీపీస్కూల్, చిన్నకంబలూరు
రామకృష్ణయ్య	ఎస్‌జీటీ	ఎంపీపీస్కూల్, లింగందిన్నె
జయమ్మ	ఎస్‌జీటీ	భవిత సెంటర్, ఆళ్లగడ్డ
గౌసియా హుసేన్‌బీ	ఎస్‌జీటీ	ఎంపీపీ స్కూల్, ఆలమూరు
సునంద	ఎస్‌జీటీ	ఎంపీయూపీ స్కూల్, బిల్లలాపురం
రాజశేఖర్‌రెడ్డి	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, ఎర్రగుంట్ల
బాలరాజు	జూ.లెక్చరర్	ప్రభుత్వ కళాశాల, ఎర్రగుంట్ల



ఆలమూరులో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన గౌసియా ఉసేన్‌బీ

ఆనందంగా ఉంది



నేను 1997 జనవరిలో దొర్నిపాడు మండల యంపీపీ పాఠశాలలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను.అదే ఏడాది నాకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన 22 సంవత్సరాల్లో దాదాపు 18సంవత్సరాలు విద్యార్థులకు ఇంగ్లిషు బోధిస్తున్నాను. ఈ సబ్జెక్టులో ప్రతి ఏడాది పిల్లలు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇస్తున్నా. అర్థవంతంగా బోధన చేయడంతో పాటు విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ వారి ఉన్నతికి కృషి చేస్తున్నాను. దీనిని గుర్తించి ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా రెండో సారి అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

– ఐదీ క్రిష్ణ శాస్త్రి, స్కూల్ అసిస్టెంట్, బాలుర ఉన్నత పాఠశాల, చాగలమర్రి

సేవకు గుర్తింపు



ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ సైన్స్ పోటీల్లో చాగలమర్రి ఓరియంటల్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పలుమార్లు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఇందుకు నా వంతు కృషి చేశాను. ఇప్పుడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడంతో సంతోషంగా ఉంది. మరింత మెరుగ్గా పనిచేసేందుకు ఈ ప్రోత్సాహం దోహదం చేస్తుంది. టీచర్లకు అవార్డులు, అభినందనలు ఎంతో తృప్తినిస్తాయి. – రామ లక్ష్మమ్మ, ఫిజిక్స్ టీచర్, ఓరియంటల్ బాలికల ఉన్నత పాఠశాల, చాగలమర్రి

ప్రతిఫలం దక్కింది



పాఠశాలఉపాధ్యాయుడిగా మొదటి పోస్టింగ్ రుద్రవరం మండలం ఎల్లావత్తుల ఉన్నత పాఠశాల. అక్కడి నుంచి మహానందికి వెళ్లాను. తిరిగి మండల కేంద్రమైన రుద్ర వరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో లెక్కల మాస్టరుగా విద్యార్థులకు బోధన చేస్తున్నా. గతంలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు దరఖాస్తు చేసుకోమ్మని తోటి ఉపాధ్యాయులు చెప్పే వారు. అయితే అలా చేసుకోవడం నాకు నచ్చలేదు. 27 ఏళ్ల నా సర్వీసులో చేసిన సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడం నాకు ఎంతో తృప్తి నిస్తోంది. నా సేవకు తగ్గ ప్రతిఫలం లభించింది.

– వెంకటరమణ, జెడ్పీ ఉన్నత పాఠశాల, రుద్రవరం

చెప్పలేని అనుభూతి



సర్వీసు ముగిసే సమయంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా. నేను ఇలా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అవుతానని అనుకోలేదు. విద్యాశాఖ నుంచి బుధవారం సమాచారం అందగానే చెప్పలేని ఆనందం. అనుభూతి కలిగింది. నాకు ఉపాధ్యాయుడిగా మొదటి పోస్టింగ్ కొత్తపల్లె మండలంలో వచ్చిన ఆపై సర్వీసంతా రుద్రవరం మండలంలోనే సాగింది. ఉపాధ్యాయుడిగా పిల్లలకు క్రమశిక్షణతో కూడిన చదువు నేర్పించేందుకు ప్రాధాన్యత ఇచ్చాను.

– ఏసుదాసు, చిన్నకంబలూరు స్పెషల్ పాఠశాల

ముగిసిన శివచతుస్సప్తాహ భజనలు

శ్రీశైలంటెంపుల్: శ్రావణమాసం సందర్భంగా లోక కల్యాణార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహించిన శివచతుస్సప్తాహ భజనలు బుధవారం ముగిశాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలో చండీశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ కళాకారులతో కలిసి ప్రదక్షిణ చేసి ప్రత్యేక పూజలు చేసి భజనలను ముగించారు. ఆగస్టు 5 నుంచి ప్రారంభమైన అఖండ భజనలు ఆలయ ప్రాంగణంలోని వీరశిరోమండపంలో శ్రావణమాసమంతా రేయింబవళ్ళు శివపంచాక్షరి నామభజన చేశారు. కర్నూలు నగరానికి చెందిన అయిదు భజన బృందాలు, కర్ణాటకకు చెందిన మూడు భజన బృందాలకు భజనలు చేయడానికి అవకాశం కల్పించారు.

సాక్షిగణపతి, వీరభద్రస్వామికి విశేష పూజలు

శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలాలతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామి వారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

వదలని వర్షం

- దెబ్బతింటున్న పంటలు
- ఆందోళనలో రైతులు

దొర్నిపాడు: వారం రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు బీళ్లవుతున్నాయి. పంటలు కూడా నీరుకుట్టు తీసుకోని కుళ్లి పోతున్నాయి. మండలంలో ఖరీఫ్‌లో సాగుచేసిన కంది, మినుమ, పత్తి పంటల్లో గడ్డి ఏపుగా పెరగడంతో పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. తీరా కోత సమయంలో మినుముకు వర్షం గండంగా మారింది. కలుపు తీయించేందకు కూలీలకు ఇబ్బంది కరంగా మారండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 23 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు.

ఉయ్యాలవాడ: కుందూనది ఉగ్రరూపంతో పొలాల్లో వరద నీరు చేరి 272 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. నది తీరం వెంట 14 గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో 245 హెక్టార్లలో వరి పంట, 27 హెక్టార్లలో కంది, మొక్కజొన్న, పత్తి పంటకు నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. నర్సిపల్లె, హరివరం, అల్లూరు, రూపనగుడి, సుద్దమల్ల గ్రామాల్లో అత్యధికంగా వరి పంట సాగు చేశారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. తీరా కుందూనది ఉగ్రరూపంతో పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. పట్టించుకోవాల్సిన వ్యవసాయాధికారులు తమ గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని రైతులు వాపోతున్నారు.



క్రిష్టిపాడు.. కందిపంటలో నిలిచిన నీటిలో ఏపుగా పెరుగుతున్న గడ్డి



ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది





నర్సిపల్లె సమీపంలో నీట మునకలో వరి పైరు, భాగ్యనగరంలోని పత్తిచేనులో నిలిచిన వర్షపు నీరు

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేష్

దొర్నిపాడు: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ వెంకటేష్ ఉత్సవ కమిటీకి సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక ఉత్సవ కమిటీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సౌండ్ సిస్టం సిద్ధం చేసుకోవాలని తెలిపారు. నిమజ్జనం సమయంలో డీజేకు అనుమతి లేదన్నారు. ఘాట్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిటీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం

నంద్యాల(న్యూటౌన్): పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను పూజిద్దామని శ్రీ గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి పేర్కొన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు 200 మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

చాగలమర్రి: ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చాగలమర్రి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.అంజలి అన్నారు. బుధవారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక 3వ సచివాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వివిధ జబ్బులతో బాధపడుతున్న వారిని పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, సీహెచ్‌ఓ సురేంద్ర, ఏఎన్ఎం గార్లెట్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వరదల్లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): వరదల్లో నష్టపోయిన ప్రజలను, రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నంద్యాల సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, నాగరాజు, ఏసురత్నం, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణకు మద్దతు ఇవ్వాలి

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్‌బోర్డు చట్ట సవరణకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని విశ్వహిందూపరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రం విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరెడ్డి కోరారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ లొసుగులతో ఉన్న వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించేందుకు కేంద్రప్రభుత్వం పూనుకుందన్నారు. ప్రతిపక్షాలు ఓటుబ్యాంకు కోసం వ్యతిరేకిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ సందీప్, వెంకటసుబ్బయ్య, నాగరాజు, రామాంజనేయులు, రాజశేఖర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పురోగతి సాధించాలి

శిరివెళ్ల: వంద రోజు ప్రణాళికల లక్ష్య సాధనలో పురోగతి కనబర్చాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ బాలాజీనాయక్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు, పనుల పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ రామసుబ్బయ్య, ఈసీ సుబ్బరాయుడు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నంద్యాల(అర్బన్): స్థానిక బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మూలసాగరం పీహెచ్‌సీ సిబ్బంది బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ వసతి గృహం సంక్షేమ అధికారి వేణు గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్

ఆకతాయిలకు జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ముల్లాన్‌పేటకు చెందిన సలీంబాషా, షేక్ అల్లాఫ్ అనే ఆకతాయిలకు సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి పది రోజులు జైలుశిక్ష విధించారు. పై నిందితులు ఎస్‌బీఐ కాలనీలో రోడ్డుపై వెళ్లే మహిళలకు సైగలు చేస్తూ, ఈలలు వేస్తూ ఇబ్బంది కలిగిస్తుండటంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో బుధవారం జడ్జి జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శిరివెళ్ల: చెన్నూరులో పేకాటాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు. దాడిలో పాణ్యం మండలం తమ్మరాజుపల్లెకు చెందిన మహేష్, శిరివెళ్ల మండలం మోత్కులపల్లెకు చెందిన వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ. 27, 520 నగదు, 3 మోటార్ సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉయ్యాలవాడ: మాయలూరు గ్రామ సమీపంలో బుధవారం రైల్వే ట్రాక్ వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.4,600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామంజనేయరెడ్డి తెలిపారు.

అగ్గిపెట్టె లేదన్నందుకు తలపై దాడి

బొమ్మలసత్రం: సిగరెట్ వెలిగించుకునేందుకు అగ్గిపెట్టె ఇవ్వలేదని ఓవ్యక్తి తలపై మందుబాబు రాయితో దాడి చేశాడు. ఈ సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. అవుట్ పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు.. స్థానిక ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన మనోహర్‌రెడ్డి అదే ప్రాంతంలో డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్నాడు. ఇంటి నుంచి డ్రైవింగ్ స్కూల్‌కు బైక్‌పై వెలుతుండగా ఫోన్ రావటంతో రోడ్డు పక్కన బైక్ నిలిపి మాట్లాడుతున్నాడు. ఇంతలో మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి అతడి వద్దకు వెళ్లి సిగరెట్ వెలుగించుకునేందుకు అగ్గిపెట్టె అడిగాడు. తన వద్ద అగ్గిపెట్టె లేదని సమాధానం చెప్పడంతో ఆగ్రహించిన మందు బాబు పక్కనే ఉన్న రాయితో మనోహర్‌రెడ్డి తలపై దాడి చేశాడు. తీవ్ర గాయమైన అతడు స్థానికులు సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికెళ్లి చికిత్స చేయించుకున్నాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మందు బాబు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

యర్రగుంట్లలో చోరీ

శిరివెళ్ల: యర్రగుంట్లలో రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి ఇంటిలో చోరీ జరిగింది. రూ. 20 వేలు నగదు, తులంన్నరం బంగారం ఎత్తుకెళ్లారు. ఇంటి యజమాని మేడా చిన్న కొండయ్య గత నెల 22వ తేదీన ఇంటికి తాళం వేసి సొంత సనిమీద భార్యతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి ఈ నెల 3న ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలోని సామన్లు చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని బుధవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ చిన్న పీరయ్య ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

గంజాయి స్వాధీనం

బొమ్మలసత్రం: అరకు నుంచి నంద్యాలకు గంజాయి తీసుకొచ్చి రైల్వే స్టేషన్ సమీపంలో విక్రయిస్తున్న ఐదుగురిని త్రీటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 4.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీ చేసి పట్టుకున్నట్లు సీఐ సూర్యమౌళి తెలిపారు.

- నంద్యాల వన్‌టౌన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని గుర్తించి పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద బ్యాగులో ఉన్న 2.25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

35 మద్యం బాటిళ్ల స్వాధీనం

బొమ్మలసత్రం: అయ్యలూరుమెట్ట శివారులో అదే ప్రాంతానికి చెందిన నాగేశ్వరరెడ్డి మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి 35 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నజీర్‌హుస్సేన్ తెలిపారు.